



# ఒకరాత్రి - నలుగురు మనసులు

—జె. శ్యామల

**"అక్షరసుధ"కు అంతర్జాతీయ కవితల పోటీలో ప్రత్యేక అవార్డు లభించడం నిజంగా మనకు గర్వకారణం" అంటూ అభినందనలు జోడించి పేపర్లన్నీ గొప్ప గొప్ప భాషనంతా ఉపయోగించి, ఎన్నో రకాలుగా ఆ వార్తను అన్ని హంగులతో అలంకరించి ప్రచురించాయి.**

రేడియో చెవిని ఇల్లు కట్టుకుని రోజంతా పోరింది. దూరదర్శన్ వారు మళ్ళీ, మళ్ళీ 'కనులపండుగ' వేశారు. అభినందనల పరంపరకు అంతేలేదు.

'అక్షరసుధ' అన్నది కలంపేరు అతడి అసలుపేరు ధర్మరాజు. ఉదయం నుండి అన్ని పేపర్లనూ చూసి రేడియోవిని, టీ.వి. చూసి, అభిమానుల అభినందనలను రిసీవ్ చేసుకుని ఆనందంతో అలసి పోయాడు అక్షరసుధ.

పేపర్లన్నీ మరో మారు ఆప్యాయంగా తడిమి, ఏ పేపరులో తన ఫోటో బాగా వచ్చిందీ బేరీజు వేసకుని, షెల్ఫ్‌లో భద్రంగా దాచి, కళ్ళద్దాలు టేబుల్ మీద వుంచి పక్క మీద వాలాడు.

కంటికి కునుకు రావటల్లేదు. ఆనందం ఎక్కువైనా నిద్రపట్టదేమో రోజంతా జరిగిన క్రమం రీలులా కళ్ళ ముందు కదులుతోంది. ఇంత ఆనందం వెనుకా ముల్లులా గుచ్చుకుంటున్న ప్రశ్న తోసేసినా తప్పు కోకుండా మళ్ళీ, మళ్ళీ గుచ్చుకుంటోంది. అది తన భార్య శారద, కొడుకు యశస్వి, కూతురు విద్యల ప్రవర్తన ఈ ముగ్గురిలోనూ తన విజయం పట్ల నిజమైన ఆనందం వ్యక్తం కాలేదు. ఇంత మంది అభిమానులను సంపాదించాడు కానీ ఇంట్లో వాళ్ళ అభిమానానికే నోచుకోలేక పోయాడు. కృతకంగా నవ్వు పులుముకున్నారే కానీ ముగ్గురి పెదవుల మీద నిజమైన నవ్వుల పువ్వులు విచ్చుకోలేదన్నది తను స్పష్టంగా గుర్తించాడు.

ఇలా ఎందుకు జరిగింది? పోనీ వాళ్ళనే అడిగితే...? ఉహూ. ఈ విషయం గురించి నేరుగా వాళ్ళను అడగడం కూడా తనకి ఇష్టంగాలేదు. అయినా కవిత్వం గొప్పతనం వీళ్ళకేం తెలుస్తుంది? ఎంతైనా తల్లీ, పిల్లలు ఒకటి. తనే పరాయివాడు. క్రమంగా ఆనందం స్థానాన్ని ఆవేదన ఆక్రమిస్తోంది. మనసంతా అశాంతి... అశాంతి.

మళ్ళీ లేచాడు. టేబుల్ లైట్ స్విచ్ వేసుకుని, కుర్చీలో కూచుని, కలం అందుకున్నాడు. ప్యాడ్ మీద కలం గజిబిజిగా గిలుకుతోంది. మనసులో అశాంతి తాలూకూ అలసట అక్షరాలలో విశ్రాంతి వెదుక్కుంటోంది.

*　　*　　*　　*

శారద పక్క మీద అసహనంగా కదులుతోంది. మనసు సమీక్ష మొదలైంది.

"తన భర్త గొప్ప కవి. నిజంగా 'అక్షరసుధే' అరుదైన అవార్డు గెలుచుకున్నాడు. నిజమే అయితే తన మనసును మాత్రం గెలుచుకోలేక పోయాడు. ఇదీ తనమనసు ఎరిగిన నిజం. అవనిలో వేల వేల వనితల వ్యధార్థ జీవితాలే తన కలానికి ఇంధనా లంటూ కవితలల్లే తన భర్తకు భార్య మనసే తెలీదు. అతని భావాలన్నీ కవితలకే పరిమితం. తనకు అన్నీ ఉన్నయ్ ఒక్క అనురాగం తప్ప. అలా అని అతడు ఏ ఇతర స్త్రీలతోనూ తిరగడు. అంత మాత్రాన అదే పదివేలని తన మనస్సు సరిపెట్టు కోలేదు. అతని లోని 'యాంత్రికత'ను తను భరించలేక పోతోంది. మానసికంగా ఘనీభవిస్తోంది.

ఆవిడకేం గొప్ప కవి గారి భార్య. అంటూ తోటి ఆడవాళ్ళు అసూయగా చూస్తున్నప్పుడు "నో,నో! నేను మీరనుకున్నట్టు అదృష్టవంతురాలిని కాదు. గొప్ప దురదృష్టవంతురాలిని. నేను కోరుకునేది గొప్ప కవిని కాదు. నన్ను ప్రేమించే మనిషిని. నన్ను అభిమానించే మనసుని" అని గట్టిగా అరవాలనిపిస్తుంది.

ఆ ఆవేశాన్నంతా అణుచుకుని మూగగా నిలబడి 'గర్విష్ఠి' అని ముద్ర వేయించుకుని, పలుకని ప్రతిమలా మిగిలి వుంది. నేను కేవలం 'అర్థాంగి'ని మాత్రమే. మరో మారు అనుకుంది. కనుకొలకుల నుంచి జారుతున్న కన్నీళ్ళు పక్కనేవున్న పుస్తకంపైని సిరాక్షరాలను తడిపేస్తున్నాయి.

*　　*　　*　　*

యశస్వి చేతిలో సిగరెట్ ఎర్రగా మండుతోంది. అతని మనసూ మండుతోంది. తను గొప్ప కవి కొడుకు. నిజమే. కానీ, అదే తనకు ఇప్పుడు ఇష్టం లేదు. గతంలో ఫలానా 'అక్షరసుధ' కొడుకు అంటూ అందరూ ప్రత్యేకంగా చూస్తున్నప్పుడు తనకు గర్వంగా అనిపించేది. ఆ తర్వాత అది చికాకుగా మారింది. సాహిత్యం అంటే అందులోనూ కవితలంటే తనకెందుకో పెద్ద ఇష్టం లేదు. అయితే తనకు ఇష్టంలేనంత మాత్రాన తండ్రి మీద కానీ, కవిత్వం మీద కానీ చిన్నచూపు లేదు. కాకపోతే చిక్కు ఎక్కడ వచ్చిందీ అంటే, "వాళ్ళ నాన్నగారి పాండిత్యం

అబ్బాయికి రాలేదు. "పండిత పుత్రః పరమ శుంఠః అని అందుకే అన్నారు" అని తను వినేటట్టుగానే చాలామంది అనుకోవడం విన్నాడు. అందరి అభిరుచులూ ఒకటి కావాలని వుందా? తనకున్న ప్రత్యేకతలు తనకున్నయ్. అందరూ కష్టమనుకునే కెమిస్ట్రీలో 90% మార్కులు తెచ్చుకున్నాడు. పక్కాగా వెస్ట్రన్ మ్యూజిక్ పాడగండు. బ్రేక్ డ్యాన్స్, డిస్కో డాన్స్ ఏదైనా అవలీలగా వేయగండు. ఇవన్నీ పోకిరీ కళలని తండ్రి స్వయంగా అన్నాడు. ఏం. ఎందుకలా అనాలి? కళకు నిర్దిష్టమైన రూపం ఏదైనా వుంటుందా? తన ఉనికిని ఇలా గాయ పరచడానికి వీళ్ళందరికీ ఏం హక్కుంది? ఇంత అవమానాన్ని సహిస్తూ, వచ్చిన అందరికీ ఎదుర్కోలు పలికి, మర్యాదలు చూడడమంటే తన మనసు మండదూ?

కణతలను బలంగా రుద్దుకుంటూ చేయి మరుక్కుమనడంతో సిగరెట్‌ను వదిలేసి, మళ్ళీ ఇంకొకటి అందుకునే ప్రయత్నంలో పడ్డాడు.

*  *  *

విద్య కళ్ళ మీద చేతులు వుంచుకుని పడుకుంటే కానీ ఆ కంటికి నిదురేదీ?

నాన్న గొప్ప కవి, పండితుడు. తన పేరు మీదుగా కన్నా ఫలానా 'అక్షరసుధ'గారి అమ్మాయిగానే తన ఉనికికి ఒక గుర్తింపు. నిజానికి నాన్నతో తన అనుబంధం బలంగా వుందా? ఎప్పుడు చూసినా ఆలోచనాలోచనాల ముద్రే. ఆప్యాయతను పంచే తీరికేది? సరదాగా మాట్లాడుకోవడం, అందరూ కలిసి ఎటైనా వెళ్ళడం ఎప్పుడూ జరగదు. సన్మానాలప్పుడు తప్పనిసరిగా కారులో తండ్రితోపాటు వెళ్ళడం, జనంతో కలిసి చప్పట్లు కొట్టి తిరిగి రావడం అంతే! తనకు మొదట్నుంచీ ఇంగ్లీష్ లిటరేచర్ అంటే ఎంతో ఇష్టం. బి.ఎ.లో ఆ సబ్జెక్ట్ తీసుకుంటానంటే "వీల్లేదు. తెలుగు లిటరేచర్ తీసుకో. నేను తెలుగు కవినయితే నువ్వు ఇంగ్లీష్ లిటరేచర్ చదవడమేమిటి? అది నాకు అవమానం కాదూ?" అంటూ బలవంతంగా ఆ సబ్జెక్ట్ ఇప్పించారు. నా అభిరుచితో సంబంధమే లేనట్టు నియంతగా వ్యవహరించారు.

మొన్నటికి మొన్న, "ఆ గుమాస్తా కూతురుతో స్నేహం ఏమిటి? వాడికి వాక్‌శుద్ధి బొత్తిగా లేదు" అన్నారు. తనకు కావలసింది పరిమళతో స్నేహమే కానీ వాళ్ళ నాన్న అర్హతలు కాదు. కవితల్లోనేమో 'చెప్పులు కుట్టేవాడూ, ఛైర్మనూ చెట్టా పట్టాలేసుకు తిరగాలోయ్' అంటూ రాస్తారు. ఏమిటీ రెండు ముఖాలు?

' కొంపతీసి రేపు తనను ఆయనకు నచ్చిన ఏ యువ కవికో ఇచ్చి కట్టబెట్టరు కదా! చస్తే తను కవిని పెళ్ళి చేసుకోదు. అందరూ తన తండ్రి లాగానే వుండకపోవచ్చు. అయినా తనకు తండ్రి ధోరణితోనే ఆ ఎలర్జీ వచ్చేసింది. ఈ విషయంలో తను ఏ మాత్రం రాజీపడకుండా ధైర్యంగా ఎదిరించాలి' గట్టిగా నిర్ణయించుకుంది.


*  *  *

రాత్రి పహారాలో 'అక్షర హార్మ్యం'లో నలుగురి సభ్యుల మనసుల సమీక్షకు నిశ్శబ్ద సాక్షులు ఆ ఇంటి గోడలే. ఎక్కడో లాఠీ చప్పుడు. ఆ శబ్దానికి అందరూ సుషుప్తి నుంచి చైతన్యానికి వస్తే ఈ నలుగురూ మాత్రం ఆలోచనల చెయిన్ లాగే నిద్రను ఆశ్రయిస్తూ ప్రత్యేక గదుల్లో ప్రత్యేకంగానే మిగిలారు. ●

## బాక్సింగ్ - బాక్సింగ్

బొంబాయిలో ఆ మధ్య ఆరవ వరల్డ్ కప్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. భారత క్రీడాభిమానులు ఎమ్మారెస్ వారి పుణ్యమాని బొంబాయిలో 321 దేశాలకు చెందిన షుమారు 90 మంది మేటి బాక్సర్లను, వారి క్రీడా నైపుణ్యాన్ని చూసి ఆనందించారు. ఇలాంటి పోటీలు భారత దేశంలో జరగడం ఇదే మొదలు.

బాక్సింగ్‌ని అభిమానించే వారెందరో వ్యతిరేకించే వారు కూడా అందరే వున్నారు. పురాణాల్లో చాణూర ముష్టికులకు కృష్ణుడితో, జరాసంధ కీచకులకు భీముడితో జరిగిన ముష్టి యుద్ధాలు శత్రువుల మధ్య జరిగి, ఒక వర్గపు మరణాలతో ముగిసినవి. చరిత్రపరంగా, మధ్యయాగంలో రాజులు తమ రాక్షసానందం కోసం బానిసల మధ్య ముష్టి యుద్ధాలు జరిపేవారు. అదే క్రీడ



రూపాంతరాలు చెంది ఈనాడు బాక్సింగ్‌గా అవతరించింది. చాలా మంది క్రూర క్రీడగా భావించే బాక్సింగ్‌లో ఎందరో అభ్యర్థులు తీవ్రంగా గాయపడి వికలాంగులు కాగా, కొందరు ప్రాణాలే కోల్పోయారు.

ఒకప్పుడు బాక్సింగ్ ప్రపంచ విజేత అయిన క్యూబా దేశస్థుడు బిన్నీ పేరట్ అమెరికన్ బాక్సర్ ఎమైల్ గ్రఫీత్ కొట్టిన దెబ్బలకు మెదడు నరాలు చిట్లి ఎనిమిది రోజులు కోమాలో వుండి మృత్యువుతో పోరాడి ప్రపంచ విజేత కిరీటంతో పాటు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నాడు. ప్రపంచం ఆ విషాదం నుంచి తేరుకోక ముందే 32 ఏళ్ళ అమెరికన్ దేశస్థుడు టన్నీ హస్పెకర్ కణత క్రిందుగా తగిలిన దెబ్బల కారణంగా నరాల పక్షవాతం వచ్చి చికిత్సకు తరలించే లోపునే ప్రాణాలు వదిలాడు. ఎందరో క్రీడాకారులకు దేహంలో సున్నిత భాగాలు దెబ్బతినడం, బ్రెయిన్ హేమరేజ్ రావడం, కొన్ని దెబ్బల వల్ల రక్తం గడ్డకట్టి రక్త ప్రసరణ లేమి వల్ల ప్రాణాలు పోవడం యీ ఆటలో ఎన్నోసార్లు జరిగింది. తెలివితేటలు - శక్తియుక్తులతో ఒకరిపై ఒకరు ఆధిక్యత నిరూపించుకోవడం క్రీడ కాగలదు గాని - గెలవడం కోసం కేవలం శారీరక బల ప్రదర్శన చెయ్యడం, అవతలివారి దేహాన్ని నజ్జు నజ్జు చెయ్యడం కాదు కదా!

-లలితాదేవి

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్